## క్లుప్తంగా

### పరిష్కార వేదికకు ఒకేఒక్క అర్జీ



తెనాలిఅర్బన్: గంగానమ్మపేటలోని నూనె గానుగ షాపు వలన కొన్ని చర్మ సంబంధమైన సమస్యలు వస్తున్నాయని వెంటనే దానిని అక్కడ నుంచి తొలగించాలని ఆ ప్రాంతానికి చెందిన చైతన్య కోరారు. మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. చైతన్య నుంచి మేనేజర్ ఆర్.చాందీ దేవసేన వినతి పత్రం తీసుకుని పరిశీలించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

### మీకోసంలో మొత్తం 9 అర్జీలు



తెనాలి: స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ వి.సంజనా సింహ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వివిధ ప్రాంతాల్నుంచి వచ్చిన వారు తమ సమస్యలను చెప్పుకుని, అర్జీలను అందజేశారు. నిర్ణీత వ్యవధిలో వారి సమస్యలను పరిష్కరిస్తామని సబ్‌కలెక్టర్ చెప్పారు. రెవిన్యూకు సంబంధించి మూడు, ఎంపీడీవో, పోలీస్, టిలికం, విద్యుత్, ఆర్‌అండ్‌బీ, వాణిజ్య పన్నులశాఖలకు సంబంధించి ఒక్కొక్కటి చొప్పున ఆరింటితో కలిపి మొత్తం తొమ్మిది అర్జీలు వచ్చినట్టు తెలియజేశారు. వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

### అగ్నిప్రమాద బాధితులకు చేయూత



తెనాలిరూరల్: అగ్నిప్రమాద బాధితులకు అధికారులు, రెడ్‌క్రాస్ సంస్థ ప్రతినిధులు చేయూతనందించారు. మండలంలోని అంగలకుదురు గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఆదివారం జరిగిన అగ్నిప్రమాదంలో బెల్లంకొండ అంకమ్మరావుకు చెందిన ఇల్లు, ఉప్పాల గోపికి చెందిన చావిడి పూర్తిగా దగ్ధమయ్యాయి. వీరికి ప్రభుత్వం తరపున బియ్యం, నిత్యావసరాలను తహసీల్దార్ గోపాలకృష్ణ సోమవారం అందజేశారు. అలానే రెడ్‌క్రాస్ సంస్థ తరపున తెనాలి కార్యదర్శి ముమ్మనేని భానుమతి పట్టాలు, సరుకులను అందజేశారు. గ్రామ ఉపసర్పంచ్ కనగాల నాగభూషణం, మొవ్వ సత్యనారాయణ, శివయ్య బాధితులకు ఆర్థికసాయం అందజేశారు. రెడ్‌క్రాస్ కోఆర్డినేటర్ ఎస్‌కే జానీరసూల్, కోశాధికారి ఆనకం శ్రీమన్నారాయణ మూర్తి, బుజ్జిబాబు పాల్గొన్నారు.

### అంగలకుదురులో పౌరహక్కుల దినోత్సవం



తెనాలిరూరల్: మండలంలోని అంగలకుదురు గ్రామ ఎస్టీ కాలనీలో పౌరహక్కుల దినోత్సవాన్ని సోమవారం రాత్రి నిర్వహించారు. తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ, రూరల్ సీఐ బెల్లం శ్రీనివాసరావు పాల్గొని స్థానికులతో మాట్లాడారు. మంగళగిరికి చెందిన ఓ వ్యక్తి పందులను తెచ్చి కాలనీ సమీపంలో వదులుతున్నాడని, పొలాల్లోని పంటను నాశనం చేస్తున్నాయని ప్రజలు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అదేమని అడిగితే కుల పంచాయతీ పెడుతున్నాడని చెప్పారు. తహసీల్దార్ మాట్లాడుతూ ప్రస్తుత నాగరిక సమాజంలో కుల పంచాయతీలకు తావులేదని, ఏదైనా ఇబ్బంది తలెత్తితే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి ఒక్కరికీ రాజ్యాంగం కొన్ని హక్కులను కల్పించిందని వాటి గురించి అవగాహన పెంచుకుని స్వేచ్ఛగా జీవించాలని చెప్పారు.

### వెల్లటూరు హైస్కూల్‌కు గ్లాసులు, ప్లేట్లు వితరణ

వెల్లటూరు(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం వెల్లటూరు జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం నిమిత్తం ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఉపాధ్యాయులు కొల్లా వెంకటేశ్వరరావు సౌజన్యంతో సైన్స్ ఉపాధ్యాయులు కె.శివరామకృష్ణ గ్లాసులు, భోజనం ప్లేట్లు అందజేశారు. సోమవారం వీటిని హెచ్‌ఎం కె.అరుణ కుమారికి అందచేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గుర్రం మురళీమోహన్, కొండపల్లి కుటుంబరావు, పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య నిర్వహణపై ప్రణాళికలు ఉండవా?

- ప్రభుత్వాలు పిలుపు ఇచ్చినప్పుడే వారుల్లో స్పెషల్ డ్రైవ్‌లా?
- శాశ్వత ప్రణాళికలు రూపొందించాలని కౌన్సిలర్ సూచన
- కుక్కల సమస్యను పరిష్కరించాలని వినతి
- వాడివేడిగా తెనాలి మునిసిపల్ సమావేశం
- ఒక అంశం మినహా మిగిలిన అంశాలన్నీ ఆమోదం





కుక్కల సమస్యను పరిష్కరించాలని కోరుతున్న కౌన్సిలర్లు (ఇన్‌సెట్) సమావేశానికి అధ్యక్షత వహించిన చైర్‌పర్సన్ రాధిక

తెనాలిఅర్బన్: పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా ఉంది. ప్రభుత్వాలు స్వచ్ఛతా హి సేవా వంటి కార్యక్రమాలు చేయాలని పిలుపునిస్తే అప్పుడు మాత్రమే వార్డులలో డ్రైవ్‌లు నిర్వహిస్తున్నారు. మనం శాశ్విత ప్రణాళికలు రూపొందించుకుని ఎందుకు పారిశుద్ధ్య నిర్వహణ చేయలేకపోతున్నామంటూ వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ తాడిబోయిన రామయ్య అధికారులను ప్రశ్నించారు. మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని సోమవారం కౌన్సిల్ హాల్‌లో నిర్వహించారు. సమావేశానికి చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధ్యక్షత వహించారు. సమావేశం ప్రారంభమై మొదటి అంశం చదవటం పూర్తి కాగానే కౌన్సిలర్ రామయ్య లేచి పారిశుద్ధ్య నిర్వహణపై ప్రశ్నించారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా సిబ్బంది లేకపోవటం, పారిశుద్ధ్య కార్మికుల పోస్టుల ఖాళీల వల్ల పారిశుద్ధ్య నిర్వహణ సరిగా చేయలేకపోతున్నామని మున్సిపల్ ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల తెలిపారు. ఖాళీల భర్తీకి చర్యలు తీసుకుని రోజువారి కూలీలతో నిర్వహణ చేయించాలని సూచించారు.

అనంతరం టీడీపీ కౌన్సిలర్ అన్నం పిన్నారావు లేచి తన వార్డులో రెండు సచివాలయాలున్నాయని, ప్రక్క వార్డులోని వివిధ రోడ్డులలో కొంత భాగం తన పరిధిలోదని, దానిలో ఏదైన అభివృద్ధి కార్యక్రమం చేయించాలంటే ఎవరు చేయించాలో తనకు తెలియజేయాలని కోరారు. ఇంతలో వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్‌లు కుర్రా సుజాత, గుంటూరు కోటేశ్వరరావులు కూడా తమ వార్డులలో కూడా ఇలాంటి పరిస్థితి ఉందని చెప్పారు. కొన్ని వార్డులలో ఇలాంటి పరిస్థితి ఉన్న మాట వాస్తవమని, దీని స్టేట్ పాలసీ అని దీనిపై తాను ఏమి చేయలేనని కమిషనర్ బండి శేషన్న తెలిపారు. అయితే కౌన్సిల్‌లో తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపుదామని సూచించారు.

తెనాలి పట్టణంలో కుక్కల బెడద ఎక్కువగా ఉందని, సమస్యను పరిష్కరించాలని వైఎస్సార్ సీపీ కౌన్సిలర్‌లు తిరుమలశెట్టి సామ్రాజ్యం, గుంటూరు కోటేశ్వరరావు, తాడిబోయిన రామయ్య, కుర్రా సుజాతలు కోరారు. వర్షాలు పడుతుండటం వల్ల కుక్కల శస్త్ర చికిత్సాలయంలో శస్త్ర చికిత్సలు చేయలేకపోతున్నామని, వెంటనే వాటిని చేసే విధంగా చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చారు. అరవ అంశం చదవటం పూర్తి కాగానే 14వ అంశం మినహా మిగిలిన అన్ని అంశాలు ఆమోదిస్తున్నట్లు చైర్‌పర్సన్ రాధిక ప్రకటించి సమావేశాన్ని ముగించారు.

సమావేశంలో వైస్ చైర్మన్‌లు మాలేపాటి హరి ప్రసాద్, అత్తోట నాగవేణి, అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మిపతి, ఇన్‌చార్జి ఎంఈ శ్రీనివాసరావు, కౌన్సిలర్‌లు, కో ఆప్షన్ సభ్యులు, వివిద విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## తెనాలి సుందరీకరణలో భాగస్వాములు కావాలి

**మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక**

తెనాలిఅర్బన్: పట్టణ సుందరీకరణలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, కమిషనర్ బండి శేషన్న పిలుపునిచ్చారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా 3, 14, 15 వార్డులలో సోమవారం ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా వార్డులలోని అన్ని విధులను శుభ్రం చేశారు. అలాగే మురుగు కాల్వలను బాగు చేసి బ్లీచింగ్, స్ప్రెయింగ్ చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెనాలి పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దేకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో



ప్రతిజ్ఞ చేస్తున్న చైర్‌పర్సన్ రాధిక, కమిషనర్ శేషన్న

కౌన్సిలర్లు దాసరి వీరవసంతరావు, గుంటూరు కోటేశ్వరరావు, పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

## పౌష్టికాహారంతో ఆరోగ్యం

కొల్లూరు : గర్భిణులు పౌష్టికాహారం తీసుకుని ఆరోగ్యంగా ఉండేలా చూడాల్సిన బాధ్యత అంగన్‌వాడీ కార్యకర్తలదేనని వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు చెప్పారు. సోమవారం కొల్లూరు మండలపరిషత్ కార్యాలయంలో ఐసీడీఎస్ అమృతలూరు ప్రాజెక్టు పరిధిలోని మండలాల ఆధ్వర్యంలో నిర్వహించిన పౌష్టికాహార మాసోత్సవాలు ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడుతూ, ఐసీడీఎస్ పరిధిలో అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహారాన్ని లబ్ధిదారులకు సకాలంలో అందజేయాలని సూచించారు. గర్భిణులు, బాలింతలు వైద్య సలహాలను పాటించి బలవర్ధకమైన ఆహారాన్ని స్వీకరించడం ద్వారా పౌష్టికాహార లోపాలను నిర్మూలించుకోవాలని సూచించారు. అనంతరం గర్భిణులకు నిర్వహించిన సీమంత కార్యక్రమంలో పాల్గొని, అంగన్‌



కార్యక్రమంలో ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు

వాడీ కార్యకర్తలు నిర్వహించిన పౌష్టికాహార పదార్థాల ప్రదర్శనను తిలకించారు. కార్యక్రమంలో సీడీపీఓ విజయలక్ష్మి, మాజీ ఎంపీపీలు కనగాల మధుసూదన్ ప్రసాద్, మైనేని మురళీకృష్ణ, జనసేన మండల కన్వీనర్ బొందలపాటి చలమయ్య తదితరులు పాల్గొన్నారు.

## స్కూల్ గేమ్స్‌లో సత్తా చాటిన ఉర్దూ స్కూల్ విద్యార్థులు

**జిల్లాస్థాయి పోటీలకు 71 మంది ఎంపిక**

గుంటూరు ఎడ్యుకేషన్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన నియోజకవర్గస్థాయి క్రీడా పోటీల ఎంపికల్లో పాత గుంటూరు నందివెలుగు రోడ్డులోని ఏపీ రెసిడెన్షియల్ ఉర్దూ బాలుర హైస్కూల్‌కు చెందిన 71 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఒకే పాఠశాల నుంచి ఇంత పెద్ద సంఖ్యలో విద్యార్థులు జిల్లా స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక కావడం ఉమ్మడి గుంటూరు జిల్లాస్థాయిలో ఇదే ప్రథమం. ఈసందర్భంగా పాఠశాలలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ ఐ.జయప్రకాష్ అభినందించారు. గత నెల 24, 26, 28వ తేదీల్లో గుంటూరులోని ఎన్టీఆర్ స్టేడియం, టీజేపీఎస్ కళాశాల, ప్రభుత్వ ఉర్దూ హైస్కూళ్లలో జరిగిన క్రీడల్లో తమ పాఠశాల విద్యార్థులు అన్ని విభాగాల్లో పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శించారని ఆయన చెప్పారు. ట్రాక్, ఫీల్డ్ ఈవెంట్స్‌లలో అండర్-14 విభాగంలో 11 మంది, అండర్-17 విభాగంలో 12 మంది ఎంపికైనట్లు వివరించారు. అదే విధంగా ఇండోర్ గేమ్స్‌లలో చెస్ క్రీడలో అండర్-14 విభాగం నుంచి నలుగురు, యోగా అండర్-14 నుంచి ముగ్గురు, అండర్-17లో ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారని తెలిపారు. షటిల్ బ్యాడ్మింటన్ అండర్-14 విభా




విద్యార్థులతో ప్రిన్సిపాల్ జయప్రకాష్, ఉపాధ్యాయ బృందం

గంలో ఇద్దరు, అండర్-17 విభాగంలో మరో ఇద్దరు ఎంపికైనట్లు తెలిపారు. కబడ్డీ అండర్-14 విభాగంలో ఏడుగురు, అండర్ 17 విభాగంలో ఆరుగురు, వాలీబాల్ అండర్-14లో ఇద్దరు, అండర్ 17లో నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఖోఖో అండర్-14లో తొమ్మిది మంది, అండర్ 17లో 8 మంది చొప్పున ఎంపికైనట్లు వివరించారు. జిల్లా స్థాయి పోటీలకు అత్యధికంగా 71 మంది విద్యార్థులు తమ పాఠశాల నుంచే ఎంపిక కావటం గర్వకారణమన్నారు. గతేడాది తమ విద్యార్థి బాలాజీ నాయక్ భువనేశ్వర్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి వాలీబాల్‌లో ఆంధ్రప్రదేశ్ తరపున పాల్గొని తృతీయ స్థానం పొందారని తెలిపారు. విద్యార్థులను వైస్ ప్రిన్సిపాల్ ఎం.ప్రజ్వల్, పీఈటీ ఆర్.శ్రీనివాసులు అభినందించారు.

## ఉర్దూ టీచర్ పోస్టులు భర్తీ చేయాలి

తాడేపల్లిరూరల్: రాష్ట్రంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత, ఉతన్న పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉర్దూ టీచర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. సోమవారం దుగ్గిరాల ముర్తుజా నగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2024లో నిర్వహించే డీఎస్సీలో రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉర్దూ ఉపాధ్యాయ పోస్టులన్నింటిని భర్తీ చేయడం ద్వారా ఉర్దూ విద్యాభివృద్ధికి కృషి చేయాలన్నారు. రాష్ట్రంలో 55 వేల అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, వాటిలో



మాట్లాడుతున్న షేక్ సుభాని

ఒక్కటి కూడా ఉర్దూ అంగన్‌వాడీ కేంద్రం లేకపోవడంతో ఉర్దూ విద్యా వ్యవస్థ మనుగడకే ప్రమాదంగా మారిందన్నారు. రాష్ట్రంలో ఉర్దూ అంగన్‌వాడీ కేంద్రాలను కూడా ఏర్పాటు చేసి విద్యార్థులకు ఉర్దూ విద్యను అందుబాటులోకి తేవడంతో పాటు ఉర్దూ నిరుద్యోగ మైనార్టీ యువతలకు అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లుగా ఉపాధి కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.

### కేఎల్‌యూ విద్యార్థినికి అభినందన

తాడేపల్లిరూరల్ : వడ్డేశ్వరం కేఎల్ యూనివర్శిటీలో ఈసీఈ విద్యార్థిని ఆర్యని చెబోయిన ప్రపంచ క్రీడల్లో కాంస్య పతకం సాధించింది. ఈ సందర్భంగా సోమవారం ఆ క్రీడాకారిణిని యూనివర్శిటీలో అభినందించారు. వర్శిటీ వీసీ డాక్టర్ జి.పార్థసారథి వర్మ మాట్లాడుతూ ఈ నెల 6 నుంచి 23వ తేదీ వరకు ఇటలీలో జరిగిన ప్రపంచ స్కేట్ క్రీడల్లో టీం ఇండియా తరుపున ప్రతిభ కనబరిచి కాంస్య పతకాన్ని సాధించినట్లు తెలిపారు.

### నిబంధనలకు అనుగుణంగా వాహనాలను నడపాలి

**అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ మధుసూదనావు**

తెనాలిఅర్బన్: నిబంధనలకు అనుగుణంగా వాహనాలను నడపాలని అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు ఎస్‌బీ మధుసూదనరావు, అమృతవాణిలు సూచించారు. స్థానిక ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో విజయవాడలో సోమవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. 35 ఆటోలను తనిఖీ చేశారు. నిబంధనలను పాటించని రెండు ఆటోలను సీజ్ చేశారు. మరో ఆరు ఆటోలపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సరైన పత్రాలు లేని ఆటోలకు రూ.45 వేల అపరాధ రుసుము విధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మేనేజర్ ఎ.రాజశేఖర్, అసిస్టెంట్ మేనేజర్ ప్రసాద్, పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

### ఓటరు నమోదును పరిశీలించిన ఆలపాటి

తెనాలిరూరల్: పట్టణంలోని తహసీల్దార్, మున్సిపల్ కార్యాలయాల్లో జరుగుతున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదును మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ సోమవారం పరిశీలించారు. ఓటు నమోదు గురించి తహసీల్దార్ కెవి గోపాలకృష్ణ, కమిషనర్ బండి శేషన్నను కలిసి చర్చించారు. ఓటు నమోదుపై పలు అప్లికేషన్లను వారికి అందజేశారు. అనంతరం ఆలపాటి మాట్లాడుతూ కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు మార్చిలో జరుగబోతున్నాయని చెప్పారు. 2021 నాటికి ఎవరైతే పట్టభద్రులు అయ్యారో వారందరూ అర్హులుగా చెప్పారు


### రేపు తెనాలిలో జంతువధ నిషేధం

తెనాలిఅర్బన్: గాంధీ జయంతిని పురస్కరించుకుని తెనాలి పట్టణంలో బుధవారం జంతువధను పూర్తిగా నిషేధించినట్లు మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని అన్ని మాంసం దుకాణాలు, కబేళాలను మూసివేయాలని సూచించారు. హోటల్స్, రెస్టారెంట్స్‌లో నాన్‌వెజ్‌ను వినియోగించరాదని, అలా చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### గ్రాడ్యుయేట్లు ఓట్లు నమోదు చేయించుకోవాలి

వేమూరు: గుంటూరు, కృష్ణ గ్రాడ్యుయేట్ నియోజక వర్గం ఎన్నికల నోటిఫికేషన్‌ను ఎన్నికల కమిషన్ విడదల చేసిందని తహసీల్దారు సుశీల సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రాడ్యుయేట్ ఓటు నమోదు కోసం నవంబరు 6 వరకు ఆన్ లైన్‌లో ఫారం 18 ద్వారా దరఖాస్తు చేసుకుంటామని ఆమె తెలిపారు. డిగ్రీ పూర్తి చేసిన వ్యక్తులు, ఇంటర్ లేదా డిప్లమా పూర్తి చేసిన వారు అర్హులని వెల్లడించారు. ఫారం 18తో పాటు ఆధార్ కార్డ్, డిగ్రీ సర్టిఫికెట్లు తప్పని సరిగా ఉండాలని వివరించారు. ఈపీఐసీ కార్డుతో జతపరిచి తహశీల్దారు కార్యాలయంలో అందజేయాలని వివరించారు. డ్రాఫ్ట్ ఓటర్ లిస్ట్ నవంబరు 20న విడదల చేస్తామని పేర్కొన్నారు. 23న క్లెయిమ్స్ మీద అభ్యంతరాలు తీసుకుంటామని, తుది ఓటర్ల జాబితా డిసెంబర్‌లో విడుదల చేస్తామని వెల్లడించారు.

## అద్దేపల్లి ఎస్టీ కాలనీలో ఆయుర్వేద వైద్యశిబిరం



భట్టిప్రోలు: ఏపీ ఆయూష్ శాఖ, భట్టిప్రోలు ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో సోమవారం స్థానిక పంచాయతీ పరిధిలోని అద్దేపల్లి ఎస్టీ కాలనీలోని రామమందిరం ఆవరణలో ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. ఇన్‌చార్జ్ మెడికల్ ఆఫీసర్ పి.నాగసుధ (క్రాప) వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందచేశారు. శిబిరంలో 136 మందిని పరీక్షించి సీజనల్, జనరల్ వ్యాధులకు సంబంధించి మందులు అందచేశారు. కాంపౌండర్ జి. విజితేంద్ర (జంపని), ఎంఎన్‌వో జి. ప్రసాదరావు, ఆశా కార్యకర్తలు కె.రమణ, ఎస్‌వీ రమణ, సోషల్ వర్కర్ వి.శ్రీనివాసరావు పాల్గొని వైద్య సేవలు అందించారు.

## అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు

**ఎండీయూ ఆపరేటర్లను హెచ్చరించిన తహసీల్దార్**

తెనాలిరూరల్: రేషన్ పంపిణీలో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ ఎండీయూ ఆపరేటర్లను హెచ్చరించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం మండల పరిధిలోని ఎండీయూ ఆపరేటర్లతో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ పాల్గొని రేషన్ పంపిణీపై డీలర్లకు, యండీయూలకు పలు సూచనలు చేశారు. రేషన్ పంపిణీలో అక్రమాలు జరిగితే సహించేది లేదన్నారు. ప్రతి నెల 1వ తేదీ నుంచి 15వ తేదీ లోగా రేషన్ పంపిణీ పూర్తి చేయాలని సూచించారు. ప్రజా పంపిణీ వ్యవస్థ సక్రమంగా జరిగేలా చూడాలని ఎవరికీ ఇబ్బంది లేకుండా సకాలంలో రేషన్ పంపిణీ చేయాలని చెప్పారు. చిన్న చిన్న ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో వాటిని సరిదిద్దుకోవాలని సూచించారు. మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్ (ఎండీయూ)ల నిర్వాహకులు తమకు అందించిన సరుకులను ఖచ్చితంగా పంపిణీ చేపట్టాలని, తప్పనిసరి పరిస్థితుల్లో ఎండీయూలు అందుబాటులో లేకపోతే డీలర్లు, వీఆర్వోలతో సమన్వయం చేసుకుని రేషన్ పంపిణీ చేయాలని చెప్పారు. ఇటీవల ఓ ఆపరేటర్ పోలీసులకు రేషన్ బియ్యం తరలిస్తూ పట్టుబడ్డాడని, అటువంటి ఘటనలు చోటు చేసుకుంటే కఠినంగా వ్యవహరిస్తామన్నారు. తాను స్వయంగా రేషన్ పంపిణీని పరిశీలిస్తానని చెప్పారు. పట్టణ, మండల పరిధిలోని ఎండియు ఆపరేటర్లు పాల్గొన్నారు.



ఆపరేటర్లతో మాట్లాడుతున్న తహసీల్దార్ గోపాలకృష్ణ

## సమాజ సేవకు టీచర్లు పునరంకితం కావాలి

**ఎంఈఓ నీలం దేవరాజు**

వెల్లటూరు(భట్టిప్రోలు): ఉపాధ్యాయులు సమాజ సేవకు పునరంకితం కావాలని ఎంఈఓ నీలం దేవరాజు పేర్కొన్నారు. భట్టిప్రోలు మండలం వెల్లటూరు జిల్లా పరిషత్ హైస్కూల్లో సైన్స్ ఉపాధ్యాయులుగా పని చేస్తున్న కూచిమంచి శివరామకృష్ణ ఉద్యోగ విరమణ మహోత్సవం సోమవారం హైస్కూల్‌లో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు గుర్రం మురళీమోహన్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జరిగిన అభినందన సభలో ఎంఈఓ దేవరాజు మాట్లాడుతూ ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయులు సమాజ సేవకు పునరంకితం కావాలని కోరారు.

శివరామకృష్ణను సత్కరించారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎం కె.అరుణ కుమారి, వివిధ హైస్కూళ్ల ప్రధానోపాధ్యాయులు సీహెచ్ రామకోటేశ్వరరావు, కూచిమంచి బద్రి నారాయణ, సిద్ధార్థ హైస్కూల్ కరస్పాండెంట్ వేల్పూరి నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



శివరామ కృష్ణను సన్మానిస్తున్న ఎంఈవో, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు తదితరులు

## హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తే కఠిన చర్యలు

**డీఎస్పీ రామాంజనేయులు**

బాపట్లటౌన్: హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ రామాంజనేయులు తెలిపారు. పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం విలేకరులతో మాట్లాడారు. వాహనదారులు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించడంతోపాటు హెల్మెట్ ధరించి వాహనాన్ని నడపడం ద్వారా ఏదైనా ప్రమాదం జరిగితే ప్రాణానికి ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఉంటుందన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు ఎవరూ ప్రాణాలు కోల్పోకూడదని ఎస్పీ తుషార్ డూడీ ఆదేశాల మేరకు పట్టణంలోని ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటికే జరుగుతున్న చాలా ప్రమాదాల్లో వాహనదారుల తలకు గాయాలై మరణిస్తున్నారన్నారు. ఇప్పటికే హెల్మెట్‌పై అనేక కళాశాలల్లో ప్రధాన రహదారుల్లో ప్రజలకు విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. సమావేశంలో పట్టణ సీఐ మహమ్మద్ జాని, రూరల్ సీఐలు హరికృష్ణ, రూరల్ సీఐ గంగాధర్ పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ రామాంజనేయులు

## పట్టణాభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలి



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ



సమావేశంలో పాల్గొన్న కౌన్సిలర్‌లు, అధికారులు

**మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ**

రేపల్లె రూరల్: పట్టణాభివృద్ధిలో అధికార, ప్రజాప్రతినిధులతోపాటు ప్రజలు భాగస్వాములు కావాలని మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన కౌన్సిల్ సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. ప్రస్తుత వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందన పట్టణంలో పారిశుద్ధ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామన్నారు. కాలవలు నిరంతరం పూడికలు తీయించటం, అవసరమైన ప్రదేశాలలో బ్లీచింగ్ చల్లించటం చేస్తున్నామన్నారు. ప్రజలు కాచి చల్లార్చిన నీటినే తాగాలని కోరారు. వారంలో ఒక రోజు డ్రైడేని విధిగా పాటించాలని కోరారు. అనంతరం ఏజెండాలోని 8 అంశాలను సమావేశం ఆమోదించింది. సమావేశంలో కమిషనర్ సాంబశివరావు, వైస్‌చైర్మన్‌లు గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్, కౌన్సిలర్‌లు, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మొక్కలు నాటిన కేఎల్‌యూ విద్యార్థులు

తాడేపల్లిరూరల్ : కేఎల్‌యూ ఎన్‌ఎస్‌ఎస్ విభాగం దత్తత గ్రామాల్లో నాటిన మొక్కల సంరక్షణ బాధ్యతలు వలంటీర్లే తీసుకోవాలని బయోటెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ వి.ప్రవీణ్‌కుమార్ విద్యార్థులకు సూచించారు. స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా సోమవారం తాడేపల్లి రూరల్ వడ్డేశ్వరం కేఎల్ యూనివర్శిటీ బీటీ విభాగం ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో తాడేపల్లి రూరల్ పరిధిలోని మెల్లెంపూడి గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి వలంటీర్ కనీసం రెండు మొక్కలైనా నాటి పెంచాలన్నారు. గ్రామంలోని రోడ్డుకు ఇరువైపులా పూలు, నీడనిచ్చే మొక్కలు నాటి, పండ్ల మొక్కలను ఇంటింటికి పంపిణీ చేసినట్లు ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఎం.సుధామణి తెలిపారు. ఎన్‌ఎస్ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ పి. శ్రీకాంత్ రెడ్డి పిలుపునిచ్చారు. పాల్గొన్న వారిని, సమన్వయకర్తలు పి. సురేష్, జి. చంద్రశేఖర్‌లను వర్శిటీ వీసీ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రో వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్రామ్, విద్యార్థి విభాగాధిపతి సలహాదారులు డాక్టర్ హబీబుల్లా ఖాన్ అభినందించారు.



మెల్లెంపూడిలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు